నిర్మించారు.. వదిలేశారు!

- చిలుకూరులో నిరుపయోగంగా ధాన్యం గోదాములు
- నాలుగేళ్ల క్రితం రూ.2.80కోట్ల వ్యయంతో నిర్మాణం
- ఏడాది క్రితం ప్రారంభించినా ప్రయోజనం శూన్యం
- వినియోగంలోకి తేవాలని రైతుల వేడుకోలు


చిలుకూరు మండల కేంద్రం సమీపంలో నిర్మించిన గోదాములు

చిలుకూరు: చిలుకూరు మండల కేంద్రం పరిధిలోని పలుకుబోడు భూమిలో ప్రభుత్వం నిర్మించిన రెండు ధాన్యం గోదాములు నిరుపయోగంగా మారాయి. కోదాడ వ్యవసాయ మార్కెట్‌ కమిటీ నుంచి విడుదలైన రూ.2.80 కోట్ల నిధులతో వ్యవసాయ పొలాల మధ్య ఉన్న గుట్ట ప్రాంతాన్ని చదును చేసి నాలుగేళ్ల క్రితం 5 వేల మెట్రిక్‌ టన్నుల సామర్థ్యంతో ఈ గోదాములను నిర్మించారు. ఈ గోదాముల వద్దకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులతో మాట్లాడి బేతవోలు రోడ్డు నుంచి దారి సౌకర్యం ఏర్పాటు చేశారు. అనంతరం ఏడాది క్రితం వీటిని ప్రారంభించినా నేటికీ ఉపయోగంలోకి తేకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయని స్థానిక రైతులు వాపోతున్నారు.

ధాన్యం నిల్వకు తప్పని ఇబ్బందులు

కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఈ గోదాములను ఉపయోగంలోకి తీసుకురాకపోవడంతో రైతులు పండించిన ధాన్యాన్ని ఇక్కడ నిల్వ చేసుకునే సౌకర్యం లేకుండా పోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా తాము బయట మార్కెట్‌లో గోదాముకు నెలకు బస్తాకు రూ.5 నుంచి రూ.6 చెల్లించి నిల్వ ఉంచుకుంటున్నామని రైతులు అంటున్నారు. కిరాయిలు చెల్లించి నిల్వ చేసుకోలేని రైతులు మాత్రం వెంటనే తమ ధాన్యాన్ని కల్లాల వద్దనే తక్కువ ధరకు అమ్ముకుంటున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ గోదాములు వినియోగంలోకి తెస్తే రైతులు ఆరు నెలల పాటు ఇక్కడ ధాన్యం దాచుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ యాసంగి సీజన్‌లోనైనా గోదాములను ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి



ప్రభుత్వం రైతుల ప్రయోజనం కోసం రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన గోదాములు నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉంటున్నాయి. గోదాములు వినియోగంలోకి వస్తే రైతులకు చాలా మేలు జరుగుతుంది. స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి స్పందించి వినియోగంలోకి తెచ్చేలా చూడాలి.

– కస్తూరి నర్సయ్య, రైతు, చిలుకూరు

డీజేలకు అనుమతి లేదు

- సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్‌: ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్నందున డీజేలకు అనుమతి లేదని సీఐ చరమందరాజు తెలిపారు. గురువారం ఆయన హుజూర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. మైక్‌లు పెట్టుకోవావాలనుకునేవారు ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి నుంచి తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని చెప్పారు. అనుమతి ఉన్న వారు మాత్రమే డీజే పెట్టాలని లేదంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. డీజేకు ఉపయోగించిన వాహనాన్ని సీజ్‌ చేసి కోర్టుకు అప్పగిస్తామన్నారు.

డీజే వాహనం సీజ్‌

ఎలాంటి అనుమతి లేకుండా పట్టణంలో డీజే పెట్టి ప్రజా రవాణా, ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న డీజే వాహనాన్ని పట్టుకుని సీజ్‌ చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. వాహన డ్రైవర్‌ గండు మహేష్‌, వల్లపుదాసు అచ్యుత్‌, డీజే ఓనర్‌ గండు నరేష్‌లపై కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


హుజూర్‌నగర్‌ : పోలీస్‌ స్టేషన్‌కు తరలించిన డీజే వాహనం

కాంగ్రెస్‌ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలి


మఠంపల్లిలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్‌

మఠంపల్లి: కాంగ్రెస్‌ పార్టీ నల్లగొండ లోక్‌సభ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపునకు కార్యకర్తలంతా కృషిచేయాలని యువజన కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు తెల్లపాటి శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. గురువారం మఠంపల్లిలోని మండల కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థించాలన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ నాగుల్‌మీరా, లోకేష్‌ ,మహేష్‌, సంజీవరెడ్డి, ప్రవీణ్‌గౌడ్‌, హుస్సేన్‌, కొండా నాయక్‌, శ్రీనివాస్‌, నాగరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

హుజూర్‌నగర్‌ రూరల్‌: మండలంలోని బూరుగడ్డ గ్రామంలో ఉన్న శ్రీఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహించినున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలు ఈ నెల 27 వరకు కొనసాగనున్నాయని పేర్కొన్నారు.

ట్రాలీ ఓనర్స్‌ యూనియన్‌ నూతన కమిటీ ఎన్నిక


ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఉపేందర్‌

హుజూర్‌నగర్‌: హుజూర్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో గురువారం ట్రాలీ ఓనర్స్‌ యూనియన్‌ (టీఆర్‌ఎస్‌ కేవీ అనుబంధ సంఘం) జనరల్‌ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్‌ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొల్లం నాగేందర్‌, ఉపాధ్యక్షుడిగా శంకర్‌, కార్యదర్శి వీరమల్లు, కోశాధికారిగా గౌస్‌, సహాయ కార్యదర్శిగా మంగయ్య, గౌరవ సలహాదారుగా శ్రీను, గౌరవ అధ్యక్షుడిగా పచ్చిపాల ఉపేందర్‌ ఎన్నికయ్యారు. అనంతరం వారికి టీఆర్‌ఎస్‌ కేవీ నియోజవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్‌ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు నరేష్‌ రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

5వ తరగతిలో ప్రవేశాలకు 20న లక్కీడ్రా

హుజూర్‌నగర్‌: హుజూర్‌నగర్‌ పట్టణంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం పాఠశాలలో ఈనెల 20న లక్కీ డ్రా తీయనున్నట్లు ప్రిన్సిపాల్‌ రెహానా బేగం గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం 12 గంటల వరకు హాజరు కావాలని కోరారు. తల్లిదండ్రుల సమక్షంలో డ్రా తీయనున్నట్లు తెలిపారు.

సీఐటీయూ గ్రామశాఖ ఎన్నిక

నడిగూడెం: మండలంలోని కరివిరాలలో గురువారం నిర్వహించిన సీఐటీయూ సమావేశంలో గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్‌కె.నాగుల్‌మీరా, కార్యదర్శిగా ఎస్‌కె.నబి, సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఆ సంఘం మండల కార్యదర్శి చిక్కుళ్ల ఉపేందర్‌, నాయకులు లాల్‌సాహెబ్‌, రసూల్‌, గంజి వెంకన్న, రహీం, మస్తాన్‌, జమాల్‌, షరీఫ్‌, పాపయ్య, యల్లయ్య, నక్క చంద్రం, కేసగాని భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ పార్టీలో చేరిక


కాంగ్రెస్‌ పార్టీలోకి ఆహ్వానిస్తున్న జైపాల్‌రెడ్డి

మునగాల: బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకుడు బంగారపు సత్యనారాయణ ఉరఫ్‌ బంగారు సత్యం గురువారం తిరిగి సొంతగూడైన కాంగ్రెస్‌ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గతంలో కాంగ్రెస్‌ పార్టీలో చురుకుగా పనిచేసిన సత్యం బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. తిరిగి గురువారం కోదాడలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి సమక్షంలో పలువురితో కలిసి కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ జిల్లా నాయకులు ఎలక నరేందర్‌ రెడ్డి, కాసర్ల కోటేశ్వరరావు, మండల పార్టీ నాయకులు సోమపంగు మోహన్‌, కేతిరెడ్డి మోహన్‌రెడ్డి, ఈదయ్య, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి


వెంకటేశ్వర్లు (ఫైల్‌)

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెం గ్రామ పంచాయతీ పరిధి వెంకటాయపాలెం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు(60) ఇంటి నుంచి పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా.. ఎదురుగా ప్రయాణికులతో వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చి క్షతగాత్రుడిని ప్రైవేట్‌ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

కోదాడకు తరలిన కాంగ్రెస్‌ శ్రేణులు

కోదాడ రూరల్‌, మునగాల: కాంగ్రెస్‌ పార్టీ నల్లగొండ లోక్‌సభ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం కోదాడ పట్టణంలోని నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశానికి కోదాడ, మునగాల మండలాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమాల్లో ఇరు మండలాల నాయకులు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, అమరనేని వెంకటేశ్వరరావు, ఇర్ల సీతారాంరెడ్డి, కొప్పుల జైపాల్‌రెడ్డి, జానకిరెడ్డి ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లిలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని యువకులు, మహిళలకు నిర్వహించిన స్లో బైక్‌, తాడులాగుట పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కొండేటి రామిరెడ్డి మాట్లాడుతూ స్లోబైక్‌ పోటీల్లో మొదటి బహుమతి స్థానిక పి.నవీన్‌రెడ్డికి రూ.4వేలు, రెండో బహుమతి ఎస్‌.గోపి రూ.3వేలు, మూడో బహుమతి కె.గోపి రూ.2వేలు, నాలుగో బహుమతి నాగరాజు రూ.వెయ్యి నగదు అందజేశామన్నారు. అలాగే తాడులాగుడు పోటీల్లో విజేతలైన మహిళలు, పురుషులకు పలువురు దాతల సహకారంతో బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెట్పీటీసీ అరుణాసైదులు, మోడె లింగయ్యయాదవ్‌, ఆవుల వెంకటనారాయణ, గుండెపంగు శంభయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


నేరేడుచర్లలో ముస్తాబైన నూతన రామాలయం

నేరేడుచర్ల: దాతల సహకారంతో రూ.2 కోట్ల వ్యయంతో నేరేడుచర్లలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామాలయంలో శుక్రవారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠామహోత్సవాలను నిర్వహించనున్నారు. వేదపండితులు ఉప్పల ఫణీంద్రశర్మ బృందం, గ్రామ పురోహితులు వెంకట రమణమూర్తుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వివిధ పూజలతోపాటు శ్రీసీతారామచంద్రస్వామి సమేత ఆంజనేయ విగ్రహాలతోపాటు ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన, హోమాలు, మహాపూర్ణాహుతి, మూల విరాట్‌ దర్శనం, శాంతికల్యాణం, ఇతర కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

నడిగూడెం: మండల పరిధిలోని శ్రీరంగాపురం, చాకిరాల, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, వేణుగోపాలపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌ శాఖ ఏఈ ఎస్‌కె.సైదా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో విద్యుత్‌ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కారణంగా విద్యుత్‌ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

కల్మలచెరువు సబ్‌స్టేషన్‌ పరిధిలో..

గరిడేపల్లి: కల్మలచెరువు సబ్‌స్టేషన్‌ పరిధిలోని కల్మలచెరువు ఫీడర్‌ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున శుక్రవారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌ఏఈ రావిరాల నగేష్‌ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు కల్మలచెరువు ఫీడర్‌ పరిధిలో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం


ప్రగతి నివేదిక చదువుతున్న పశువైద్యాధికారి మధు

హుజూర్‌నగర్‌ (చింతలపాలెం): చింతలపాలెం మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది. మొత్తం తొమ్మిది మంది సభ్యులకు గాను ఎంపీపీ వెంకట్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ డెక్కం లలితమ్మ మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం పూర్తి కావడంతో సమావేశం కొనసాగించారు. 23 శాఖల అధికారులకు గాను మూడు శాఖల అధికారులు మాత్రమే హాజరై తమ ప్రగతి నివేదికలను చదివి కూర్చున్నారు. మొత్తం మీద సమావేశంలో ప్రజల సమస్యలను ప్రస్తావించే వారు కరువయ్యారు. సమావేశంలో ఎండీఓ పవన్‌ కుమార్‌, ఎంపీఓ జగదీష్‌, ఏపీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ సేవాదళ్‌ కమిటీ నియామకం


నియోజకవర్గ కమిటీ సభ్యులతో నాయకులు

హుజూర్‌నగర్‌, పాలకవీడు: కాంగ్రెస్‌ సేవాదళ్‌ హుజూర్‌నగర్‌ నియోజకవర్గ యంగ్‌ బ్రిగేడ్‌ నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు శ్రవణ్‌ కుమార్‌ నియమించినట్లు జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ముస్తఫా గురువారం తెలిపారు. హుజూర్‌నగర్‌ నియోజకవర్గ అధ్యక్షుడిగా జి.నవీన్‌, ఉపాధ్యక్షుడిగా అనీఫ్‌, టౌన్‌ అధ్యక్షుడిగా ఎ.వీరేష్‌, ప్రధాన కార్యదర్శిగా క్రాంతి కుమార్‌, కార్యదర్శిగా నాగరాజు నియమితులయ్యారు. అలాగే, పాలకవీడు మండల అధ్యక్షుడిగా బెట్టెతండాకు చెందిన ధీరావత్‌ శివనాయక్‌, ఉపాధ్యక్షుడిగా పెరుమాళ్ల రమేష్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

రాయి సైదులు మృతి సీపీఎంకు తీరనిలోటు


సైదులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మునగాల: మండలంలోని నేలమర్రి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్‌ నాయకుడు రాయి సైదులు మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య అన్నారు. గురువారం అనారోగ్య కారణాలతో మృతిచెందిన సైదులు మృతదేహంపై ఆయన ఎర్రజెండా కప్పి నివాళులర్పించి మాట్లాడారు. సైదులు చిన్నతనం నుంచి ఎర్రజెండా నాయకత్వాన జరిగిన పోరాటాల్లో చురుకైన కార్యకర్తగా పనిచేశారని గుర్తు చేశారు. సైదులు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం, దేశిరెడ్డి స్టాలిన్‌ రెడ్డి, మామిడి గోపయ్య, పార్టీ గ్రామశాఖ కార్యదర్శి బట్టుపల్లి ఉపేందర్‌, నాయకులు బచ్చలకూరి సుధాకర్‌, జలగం జీడయ్య, డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి సికిందర్‌, నాయకులు బి.గోవర్ధన్‌, కె.రాములు, ఆర్‌.వెంకటరత్నం, బి.గుర్వయ్య, ఆర్‌.రాజశేఖర్‌, ఆర్‌.నాగేశ్వరరావు, ఆర్‌.శ్రీను, వి.నర్సయ్య, కె.ప్రభాకర్‌ పాల్గొన్నారు.

అధ్వానంగా పల్లె రోడ్లు


నారాయణపురం రోడ్డుపై మూడేళ్ల క్రితం పరిచిన కంకర


ఆరునెలల క్రితం కంకర పరిచిన రత్నవరం-ఆకుపాముల రోడ్డు

- కంకర పరిచి.. బీటీ నిర్మాణం మరిచిన అధికారులు
- డొంకదారులను తలపిస్తున్న నారాయణపురం, రత్నవరం రోడ్లు
- ఇబ్బందుల్లో వాహనదారులు

నడిగూడెం : మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు డొంకదారులను తలపిస్తూ అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు, వివిధ వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారుల మరమ్మతుల విషయమై అధికారులు, ప్రజా ప్రతినిధులకు అనేకసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మూడేళ్లుగా బీటీకి నోచుకోకుండా..

మండల పరిధిలోని చెన్నకేశ్వాపురం నుంచి కరివిరాల, కాగితరామచంద్రాపురం క్రాస్‌ రోడ్డు, నారాయణపురం, సిరిపురం గ్రామాల మీదుగా వల్లాపురం వరకు గత ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.4.50 కోట్ల వ్యయంతో బీటీ రహదారి నిర్మించారు. కానీ నారాయణపురం క్రాస్‌ రోడ్డు నుంచి నారాయణపురం గ్రామంలోకి మాత్రం దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వరకు బీటీ రహదారి వేయకుండా కంకర పరిచారు కానీ రహదారిని నిర్మించలేదు. దీంతో ఈ రహదారిపై గత మూడేళ్లుగా ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రోడ్డంతా కంకర తేలి ఉండడంతో నిత్యం ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారి మీదుగా నారాయణపురం, సిరిపురం, వల్లాపురం ఇంకా పలు గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఈ రోడ్డుపై లేస్తున్న దుమ్ముతో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ఏడు నెలలుగా తప్పని ఇబ్బందులు

ఇక, మునగాల మండలం ఆకుపాముల నుంచి కోదండరామాపురం, తెల్లబల్లి, గ్రామాల మీదుగా రత్నవరం వరకు ఉన్న రోడ్డు బీటీ పునర్నిర్మాణానికి రోడ్లు, భవనాల శాఖ రూ.2 కోట్ల నిధులు కేటాయించింది. దీంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌ ఏడు నెలల క్రిందట కంకర పరచారు. ఆయనకు చెల్లించాల్సిన బిల్లులు మంజూరు కాకపోవడంతో బీటీ వేయకుండా మధ్యలోనే ఆపేశాడు. దీంతో నిత్యం ఈ రహదారి మీదుగా చాకిరాల, రత్నవరం, తెల్లబల్లి, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, కోదండరామాపురం గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్లను బీటీగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



నారాయణపురం క్రాస్‌ రోడ్డు నుంచి నారాయణపురం గ్రామంలోకి వెళ్లే రోడ్డుపై మూడేళ్ల క్రితం కంకర పరిచి బీటీ వేయడం మరిచారు. దీంతో రోడ్డుపై గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.

– ఎర్ర వీరారెడ్డి, నారాయణపురం

అధికారులు స్పందించాలి



మునగాల మండలం ఆకుపాముల నుంచి కోదండ రామాపురం, తెల్లబల్లి, గ్రామాల మీదుగా రత్నవరం వరకు వెళ్లే రోడ్డుపై కంకర పరిచారు కానీ బీటీ వేయలేదు. అధికారులు స్పందించి వెంటనే బీటీ వేయించాలి.

– వెంకటనర్సయ్య, మాజీ సర్పంచ్‌, తెల్లబల్లి

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఫైర్‌ స్టేషన్‌ అధికారులు

మఠంపల్లి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం హుజూర్‌నగర్‌ ఫైర్‌స్టేషన్‌ అధికారులు అగ్నిప్రమాదాల నివారణలపై మండలంలోని ఎస్‌సీఎల్‌ పరిశ్రమలో కార్మికులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంటలు ఆర్పివేయడం తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్‌ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాసరావు, రవిబాబు, ప్రవీణ్‌, సురేందర్‌, సైదులు, శ్రీను, పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెం, వెంకటాయపాలెం గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టి అభివృద్ధి పనులను గురువారం ఎంపీడీఓ ఎం.జానకిరాములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పనులు చేడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీఓ ఆంజనేయులు, కార్యదర్శి నరసింహారావు, జూనియర్‌ అసిస్టెంట్‌ మట్టయ్య తదితరులు ఉన్నారు.



వెంకటాయపాలెం పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ తదితరులు

ఉపాధి కూలీల నిరసన

మిర్యాలగూడ : తమకు పనికి తగ్గ కూలి ఇవ్వడం లేదని ఆరోపిస్తూ మండలంలోని సుబ్బారెడ్డిగూడెం గ్రామంలో గురువారం ఉపాధి హామీ కూలీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ గ్రామంలో పూడికతీత పనులు తాము చేపడుతున్నప్పటికీ ప్రతి రోజు కూలి రూ.30 నుంచి రూ.60వరకే ఇస్తున్నారని వాపోయారు. చుట్టుపక్కల గ్రామాల్లో రూ.150కు పైగా కూలి ఇస్తుండగా మాకెందుకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఏ సౌజన్య తప్పుడు కొలతలతో తమను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఏపీడీతో పాటు పలువురు అధికారులు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఫీల్డ్‌ అసిస్టెంట్‌పై ఒత్తిడి పెంచేందుకు టీఏలు, అధికారులు ప్రయత్నించారని సమాచారం. సమస్యను పరిష్కరించేందుకురూ.30కు బదులుగా రూ.150కుపైగా కూలీ చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈసీ కళావతిని, టీఏ రాజేశ్వరీలను వివరణ కోరగా తాము కూలీలకు రూ.150కు పైగా కూలీ చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధుడు మృతి

హుజూర్‌నగర్‌ (చింతలపాలెం): మతిస్థిమితం లేని వృద్ధుడు మృతి చెందిన ఘటన చింతలపాలెం మండలంలోని తమ్మారం గ్రామ శివారులో గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తమ్మారం గ్రామానికి చెందిన కోలా వెంకటేశ్వర్లు (60) గ్రామ శివారులోని పొలాల వద్ద విగతజీవిగా కనిపించాడు. ఆయనకు భార్య మల్లీశ్వరి, ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పెండింగ్‌ వేతనాలు చెల్లించాలి

గరిడేపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్‌ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె యాకూబ్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలోని ఎంఎస్‌ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో జీవితాన్ని గడుపుతున్న జీపీ కార్మికులకు ఎనిమిది నెలలుగా వేతనాలు రాక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున కార్మికులకు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉన్నందున విధుల్లో నాలుగు గంటల విరామం ఇవ్వాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

శ్రీరాముడి పట్టాభిషేకం

భానుపురి (సూర్యాపేట): పట్టణంలోని వేదాంత భజన మందిరంలో శ్రీరాముడి పట్టాభిషేకాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఏటా శ్రీరామనవమి మరుసటి రోజు పట్టాభిషేకం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే గణపతి పూజ, విశ్వక్సేన పూజ నిర్వహించి మధ్యాహ్నం అర్చకులు భక్తుల నడుమ పట్టాభిషేకం కార్యక్రమాన్ని చేపట్టారు. ఉత్సవమూర్తులను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.

రెండు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు ప్రారంభం


బండ లాగుతున్న గుంటూరు జిల్లా గిత్తలు

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెంలో గల శ్రీకోదండరామస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న రెండు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలను గురువారం సాయంత్రం కాంగ్రెస్‌ సీనియర్‌ నేత, మాజీ ఎంపీపీ తిరుమలశెట్టి అప్పయ్య ప్రారంభించారు. ఈ పోటీలు ఈ నెల 21వ తేదీ వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు జతపండ్ల విభాగంలో ఏపీలోని గుంటూరు, పల్నాడు, కృష్ణా జిల్లాలతో పాటు సూర్యాపేటకు చెందిన గిత్తలు పోటీపడ్డాయి. జతపండ్ల విభాగంలో గెలుపొందిన గిత్తల జతకు రూ.1,01,000 నగదు బహుమతి అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ బొగ్గుల మౌలాలి, పీఏసీఎస్‌ చైర్మన్‌ రామచంద్రయ్య, ఎంపీటీసీ చెన్నయ్య, వెంకటనారాయణ, బాలసైదా, సీతారామిరెడ్డి, పకీరు అహ్మద్‌, లక్ష్మయ్య, జానయ్య, జమీల్‌, ఎం. నరసింహారావు, వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పుల్లారెడ్డి, కోటయ్య, రవీందర్‌రెడ్డి, జోజి, భద్రారెడ్డి పాల్గొన్నారు.

కల్తీ నూనె తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్‌

కోదాడ రూరల్‌: పశువుల కొవ్వుల నుంచి నూనె తయారుచేసి విక్రయిస్తున్న వ్యక్తిని కోదాడ పట్టణ పోలీసులు గురువారం అరెస్ట్‌ చేశారు. పట్టణ సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణ పరిధిలోని సాలార్జంగ్‌పేటకు చెందిన షేక్‌ యాదుల్‌ మటన్‌ షాప్‌ నిర్వహిస్తున్నాడు. ఆ పశువుల మాంసం నుంచి వచ్చే కొవ్వుతో నూనె తయారుచేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు అతడి ఇంటి వద్ద దాడులు నిర్వహించగా కొవ్వు నుంచి తయారుచేసిన 45 లీటర్ల నూనె ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ నూనెను స్వాధీనం చేసుకొని అతడిపై చీటింగ్‌, ఆహారపు కల్తీ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గంజాయితో పట్టుబడిన యువకుల అరెస్ట్‌

కోదాడ రూరల్‌: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తితో పాటు కొనుగోలు చేసేందుకు వచ్చిన ఇద్దరు యువకులను గురువారం కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్‌ చేశారు. పట్టణ సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం ఎన్టీఆర్‌ కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు చెందిన ఉయ్యాల ఆనంద్‌ అక్కడే గంజాయి కొనుగోలు చేసి కోదాడలో విక్రయించడానికి వచ్చాడు. కోదాడ బస్టాండ్‌ వద్ద పట్టణంలోని నయనగర్‌కు చెందిన షేక్‌ వినాజ్‌పాషా, గుజ్జుల రాకేష్‌రెడ్డికి గంజాయిని విక్రయిస్తుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 100 గ్రాముల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌ చేసినట్లు సీఐ తెలిపారు.